
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

మంగళవారం 30 సెప్టెంబరు 2025





బతుకమ్మను ఎత్తుకున్న మహిళ

సద్దుల సంబురం..

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా వేడుకలు
- ఖమ్మం మున్నేరు వద్ద కోలాహలంగా నిమజ్జనం
- ముగిసిన పూల పండుగ
- నాయకన్‌గూడెం వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

7



బతుకమ్మను సాగనంపుతూ..



ఖమ్మంలో మున్నేరు ఒడ్డున బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు

ఐశ్వర్యలక్ష్మిగా లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావుతోపాటు ఆలయ వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

ఉగ్రరూపం దిశగా

గోదావరి

- నేడు తుది ప్రమాద హెచ్చరిక స్థాయి దాటే అవకాశం
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- దేవస్థానం కల్యాణకట్ట కింది భాగంలోకి చేరిన వరద నీరు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

భద్రాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని రీతిలో ఈసారి గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంతవాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు 43అడుగులకు చేరడంతో తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అప్పటినుంచి క్రమంగా పెరుగుతూ ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 43.8 అడుగులకు చేరుకుంది. తెల్లవారుజామున 3 గంటలకు 44అడుగులు, ఉదయం 6గంటలకు 44.2 అడుగులు, 9గంటలకు 44.5 అడుగులు, 12 గంటలకు 44.8, సాయంత్రం 3 గంటలకు 45 అడుగులకు చేరింది. ఆరు గంటలకు 45.5, 8గంటలకు 46, రాత్రి 11గంటలకు 46.80 అడుగులకు చేరుకుంది. కాగా ప్రస్తుతం

(మిగతా 6వ పేజీలో)

సెప్టెంబర్లో తుది ప్రమాద హెచ్చరిక దాటిన సందర్భాలివే


ఏడాది	అడుగులు
19-9-1961	54.0
07-9-1966	65.9
21-9-1967	55.3
02-9-1978	54.2
07-9-1994	57.8
20.-9-2005	54.9
09-9-2014	56.0

స్థానికం.. కోలాహలం

- షెడ్యూల్ రాకతో పల్లెల్లో మొదలైన సందడి
- పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు
- పార్టీలు, ఆశావహుల్లో కోర్టు తీర్పు భయం

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో 'స్థానిక' కోలాహలం మొదలైంది. దీంతో కోడ్ అమల్లోకి రాగా.. గ్రామ పంచాయతీలు, మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. ప్రధాన రాజకీయ పార్టీలు పల్లె పోరుకు సై అంటున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన విపక్ష పార్టీల నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరికివారు ఎన్నికల కదనరంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అందరిలోనూ హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందన్న భయం నెలకొంది.

ఖమ్మం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టు తీర్పు వచ్చేనెల 8న ఉండడంతో ఎన్నికల సంఘం 9న నోటిఫికేషన్ విడుదల చేయబోతుంది. ఒకవేళ హైకోర్టు రిజర్వేషన్ల పెంపు సక్రమం కాదని చెబితే స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియలో మళ్లీ మార్పులు చేయాల్సిన పరిస్థితులు రానున్నాయి. గత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పెంపును హైకోర్టు సమర్థిస్తే కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మొత్తం మీద రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు, షెడ్యూల్ విడుదలతో ఒక్కసారిగా గ్రామాల్లో ఎన్నికల కోలహలం కనిపిస్తోంది. ఒకేసారి దసరా, దీపావళి పండుగ ధమాఖాల్లా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు పదవులకు షెడ్యూల్ రావడంతో వెంటవెంటనే ఎన్నికలు జరగబోతున్నాయి. మండల, జిల్లాపరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతుండగా, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి జిల్లా యంత్రాంగం విడతల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు జాబితాలు సిద్ధం చేశాయి. మరోవైపు ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం కొత్త రిజర్వేషన్ల ఆధారంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్,వార్డు అభ్యర్థుల ఎంపికను గ్రామస్థాయిలో గ్రామకమిటీలు చేస్తున్నాయి. ఆర్థికంగా సామాజికంగా ఆయావర్గాల్లో గుర్తింపు ఉన్న వారిని ఎన్నికల బరిలో దించేందుకు



ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో స్థానిక ఎన్నికల వైపు కాలుదువ్వుతుండగా.. విపక్ష బీఆర్ఎస్‌తో పాటు వామపక్షాలు బీజేపీ తదితర పార్టీలు కూడా తమకు పట్టున్న గ్రామాల్లో సత్తా చాటేందుకు కార్యాచరణకు రూపకల్పన చేసుకుంటున్నాయి.

కోడ్ అమల్లోకి ...

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అభివృద్ధి పనుల వంకుస్థాపన, అధికారిక సమావేశాలకు మండల, గ్రామపంచాయతీల్లో బ్రేక్ పడింది. మునిసపిల్ పట్టణాల్లో మాత్రమే కోడ్ మినహాయింపు ఉంటుంది. జిల్లాలో గ్రామపంచాయతీ, మండలపరిషత్ ఎన్నికల షెడ్యూల్ ఎన్నికలకమిషన్ ప్రకటించిన రోజునే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో ఉన్నారు. ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకుని వారు పార్టీ కార్యక్రమాలకు పరిమితమయ్యారు.

మూడు విడతల్లో 'పల్లె' పోరు

ఖమ్మం జిల్లాలో 571, భద్రాద్రిలో 471 పంచాయతీలు

7



99 శాతం హామీలను నెరవేర్చాం..

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు
- ప్రజలు ఆదరిస్తారు.. ఆశీర్వదిస్తారు..
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మధిరలో విలేకరుల సమావేశం

7



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలు

- ప్రభుత్వం ఇచ్చిన జీవోపై కొందరు హైకోర్టులో సవాలు
- కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ
- పాలేరు నియోజకవర్గ కార్యకర్తలతో మంత్రి పొంగులేటి సమీక్ష

7

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- నియమావళిని పక్కాగా అమలు చేయాలి
- ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ అనుదీప్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఆయన అదనపు కలెక్టర్లు శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసినట్టు తెలిపారు. ప్రతీ శాఖ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేసి ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మండలప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. మోడల్ కోడ్‌ఆఫ్‌కండక్ట్‌ను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వానాకాలం ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని, గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్ సీఎంఆర్ రైస్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

డెలివరీ గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. క్రాప్ బుకింగ్ 50శాతం మాత్రమే జరిగిందని, వ్యవసాయ విస్తరణాధికారి తన పరిధిలో సాగు అవుతున్న పంట విస్తీర్ణం వివరాలు సేకరించి అక్టోబరు 5లోపు క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూఫ్ టాప్ సోలార్‌పై

అవగాహన కల్పించాలి

పీఎం సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజనపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుపై అవగాహన కల్పించి అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారులు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం అధికారులతో సమీక్షించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం, సేవా పర్వ్‌పై వివరాలను తెలంగాణ నార్త్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహించేందుకు సెప్టెంబరు 17నుంచి అక్టోబరు 2 వరకు సేవా పర్వ్ పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పథకం గురించి ఇతర వివరాల కోసం టీజీఎన్పీడీసీఎల్ హెల్ప్ లైన్ 1912కు, సంబంధిత ఏఈ/డీఈ కార్యాలయాలను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ , జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆందోళన

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు సోమవారం జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు ధర్నాచౌక్‌లో ఆందోళన చేపట్టారు. గత ఆరు నెలలుగా డీలర్ల కమీషన్ విడుదల కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వానికి తమ నిరసన తెలియచేసేందుకు శాంతియుతంగా ప్లకార్డులు చేతపూని ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నేతలు డీలర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సీపీఐ సీనియర్ నాయకులు మహమ్మద్ మౌలానా, ఎర్ర బాబు, సీపీఎం డివిజన్ కార్యదర్శి విక్రమ్, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీను పాల్గొని డీలర్లు కమీషన్ కోసం చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య, గౌరవ అధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, బిందు మాధవి, కవిత, సంకిసాల ప్రసాద్, పాపారావు, షేక్ ఇబ్రహీం, వట్నాల బాబు, జె సూర్య భద్రునాయక్, మతిన్ రాజారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 21 మండలాల డీలర్లు పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన పలు రాజకీయపార్టీలు



కలెక్టర్ అనుదీప్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

దక్షిణ అయోధ్యలో విజయదశమి వేడుకలు

- 2న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహణ
- శ్రీరామ మహాపట్టాభిషేకం, శమీపూజ
- శ్రీరామలీలా మహోత్సవానికి ఏర్పాట్లు

7

నిజాయితీపరులు మా పార్టీలో చేరండి

ఆమ్‌ఆద్మీపార్టీ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

కొణిజర్ల,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నిజాయితీపరులు, నిఖార్సుగా ప్రజాసేవ చేయాలనుకున్న యువత తమ పార్టీలో చేరాలని ఆమ్‌ఆద్మీపార్టీ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సామాజిక మార్పుకోసం స్వచ్ఛందంగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థులకు ఆమ్‌ఆద్మీపార్టీ ఆహ్వానం పలుకుతుందని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో ఆమ్‌ఆద్మీపార్టీ జాతీయ పార్టీ కనుక మొదటి వరుసలో చీపురు గుర్తు ఉంటుందని ప్రజల్లో చైతన్యం, సామాజిక మార్పు కోసం పోరాడేవారికి సామాన్యుల పార్టీగా అవకాశం ఇస్తామన్నారు. ఈఅవకాశం ఉపయోగించుకోవాలని కోరారు. పోటీచేయదలచిన వారు తమ బయోడేటాతోపార్టీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో వైశాలికి స్వర్ణం

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఈనెల23 నుంచి25 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన అథ్లెట్ ఆఫ్రిన్ కాంస్య పతకం సాధించింది. తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించిన ఆమె 800మీటర్ల పరుగు పోటీ విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది.



బతుకమ్మ చీరలు కొందరికేనా?

- డ్వాక్రా సంఘాల సభ్యులకే పంపిణీ చేయాలని నిర్ణయం
- సద్దుల బతుకమ్మ పండుగ వచ్చినా వారికీ అందని వైనం
- భద్రాద్రి జిల్లాకు తొలి విడతగా చేరిన చీరలు..1,06,682



భద్రాద్రికి చేరిన బతుకమ్మ చీరల లారీ

కొత్తగూడెంఅర్బన్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ సందర్భంగా అందించే చీరలు కొందరికే అందేలా ఉన్నాయి. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరా మహిళాశక్తి అక్కా చెల్లెలకు మీ రేవంత్ అన్న కానుకగా అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కారణంగా రేషన్ కార్డుల్లోని పేరున్న ప్రతీ మహిళకు చీరెలు అందని పరిస్థితి నెలకొంది. బతుకమ్మ వేడుకలు ప్రారంభం నాటికి (ఈనెల21) చీరలు పంపిణీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. సద్దుల బతుకమ్మ పండుగ వచ్చినా.. చీరలు పంపిణీ చేయకపోవడంతో మహిళలు అసహనానికి గురవుతున్నారు.

ఈసారి కేవలం వారికి మాత్రమే చీరలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుంది. గతఏడాది బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేయలేదు. ఈసారి స్వయం సహాయక సంఘాల సభ్యులకుమాత్రమే ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించింది. సంఘాల్లో లేని మహిళలకు చీరలు ఎందుకు ఇవ్వరనే చర్చ స్థానికంగా మొదలైంది.గతబీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రేషన్ కార్డుల్లో సభ్యులైన 18ఏళ్లు నిండిన మహిళలందరికి ఒకచీర పంపిణీ చేయగా.. ప్రస్తుతం మహిళా సంఘాలకు మాత్రమే అందించాలని నిర్ణయించింది. బతుకమ్మ కానుకగా కేవలం మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేస్తే సాధారణ మహిళాముల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. బతుకమ్మ సందర్భంగా సంఘాలకు ఏకరూప చీరలు పంపిణీ చేసినా అది కానుకగానే పరిగణించే ప్రమాదం ఉందని పంపిణీని తాత్కలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

> బతుకమ్మ పండుగకు భద్రాద్రి జిల్లాలో మొత్తం మెప్మా,సెర్ప్ పరిధిలోని 981 వీవోలు, సీసీల పర్యవేక్షణలోని 22,055 మహిళా స్వయం సహాయక సంఘాల్లోని 2,16,257 సభ్యులకు పంపిణీ చేసేందుకు 1,06,682 చీరెలు వచ్చాయి. జిల్లాకు మొత్తం 2,13,367 చీరలకుగాను 106685
>
> **జిల్లాకు చేరిన చీరలు 1,06,682**
>
> చీరెలు మొదటి విడతలో వచ్చాయి. జిల్లాకు చేరిన చీరలను కొత్తగూడెం మునిసిపల్ కాంప్లెక్స్‌లోని పాత డీఆర్డీవో, మణుగూరు మెప్మా, పాల్వంచ మెప్మా కార్యాలయాల్లో ఇల్లెందు సీఆర్‌సీభవనం, భద్రాచలం, అశ్వారావుపేట, చుంచుపల్లి మం డల సమైఖ్య కార్యాలయాల్లో భద్రపరిచారు.

పంపిణీ బాధ్యతలు మెప్మా, సెర్ప్ సిబ్బందికి

తొలుత బతుకమ్మ పండుగకు ఒక చీర పంపిణీ చేసి నవంబరులో ఇందిరా జయంతి రోజున మరో చీర పంపిణీ చేయాలని భావించినా.. ప్రస్తుత పండుగ తరువాత ఒకేసారి రెండు చీరెలు సంఘాల సభ్యులకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా డీలర్లు బతుకమ్మ చీరెలు పంపిణీ చేయగా.. ప్రస్తుతం పట్టణాల్లో మెప్మా సిబ్బంది, గ్రామస్థాయిలో ఐకేపీ సిబ్బందికి చీరలు పంపిణీ బాధ్యతలు అప్పగించనున్నారు. కాగా గత ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని మొదలు పెట్టగా, మహిళల నుంచి పలు విమర్శలు వచ్చాయి. నాసిరకం చీరలను కానుకగా ఇస్తున్నారని మహిళలు ఆరోపించారు. పండుగకు ఇటువంటి చీరలు ఎవరైనా దరిస్తారా అని మండిపడ్డారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- అర్జీలు స్వీకరించిన ఖమ్మం కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- వేంసూరు మండలం కందుకూరులో గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా తమ స్థలంలో అక్రమంగా కాలువ తవ్వారని విచారించి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన గొర్ల ముత్తారెడ్డి, కలెక్టర్‌ను వేడుకున్నారు.
- ఖమ్మం నగరం మమత రోడ్డుకు చెందిన సాంబశివరావు, తనకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ వస్తున్నదని, తనకు ప్రభుత్వ ఇళ్ల స్థలం లేదా వ్యవసాయ భూమి ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.
- ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్నార్. కళాశాల మైదానంలో దీపావళి షాపులు ఏర్పాటు చేయటకు అనుమతి ఇప్పించాలని కోరుతూ వ్యాపారస్థులు దరఖాస్తు చేశారు.

5న సీపీఐ శత వసంత సభ సన్నాహక సమావేశం

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతవసంతాల ముగింపుసభ సన్నాహక సమావేశం 5న ఖమ్మంలోని ఎస్ఆర్‌గార్డెన్స్‌లో మధ్యాహ్నం జరుగుతుందని సీపీఐ ఉమ్మడి జిల్లా బాధ్యుడు ఎస్కే సాబిర్ పాష, దండి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యద ర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగే ఈసభకు ముఖ్యఅతిధిగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కె.నారాయణ, జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, పలువురు ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

ఘనంగా ఆయుధ పూజ

భద్రాద్రి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పూజలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజు



ఆయుధపూజలో పాల్గొన్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు, తదితరులు

కొత్తగూడెంపోస్టాఫీస్ సెంటర్,సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకల్లో భాగంగా భద్రాద్రి జిల్లా హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, కొత్తగూడెం డీఎస్పీ రెహ మాన్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్‌డీఎస్పీ సత్యనారాయణ, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ అశోక్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులు హాజరయ్యారు. ఆయుధ పూజ అనంతరం వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడంలో భాగంగా ఆయు పూజ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణ సబ్ జూనియర్ బాలికల కబడ్డీ చాంపియన్ భద్రాద్రి జిల్లా

అభినందించిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

చుంచుపల్లి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో ముగిసిన 35వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల,బాలిక పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెంజిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకొని టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్ పోటీల్లో నల్గొండ జట్టుపై భద్రాద్రి జట్టు గెలిచింది. టైటిల్ గెలిచిన జట్టును కొత్తగూడెంలో సోమవారం మంత్రి పొంగులేటి కార్యాలయంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురామిరెడ్డి , భద్రాద్రి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా చైర్మన్ చీకటి కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్వాతిముత్యం, జిల్లా కోశాధికారి కూరాకుల నరేష్ పాల్గొన్నారు. జట్టుకు కోచ్ రాంబాబు వ్యవహరించారు.



బాలికల జట్టును అభినందిస్తున్న ఖమ్మం ఎంపీ

బతుకమ్మ వేడుకల్లో స్వల్ప ఘర్షణ

చింతకాని,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదుమూరులో బతుకమ్మ ఊరేగింపులో బీఆర్ఎస్, సీపీఐ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. ఊరేగింపు ముందుకు సాగే క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ వీరేందర్, సిబ్బంది లాఠీలతో ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఉన్న గుంపును చెదరగొట్టారు.

ఉగ్రరూపం దిశగా గోదావరి

(5వ పేజీ తరువాయి)

10,32,816 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. గోదావరి 48 అడుగులు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తుండటంతో రెండో ప్రమాద హెచ్చరికను సైతం జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎగువ భాగాన కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రాబోయే 24గంటల్లో తుది ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులకు చేరే అవకాశం ఉన్నట్టు కేంద్ర జల సంఘం అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పలు చోట్ల రాకపోకలకు అంతరాయం

గోదావరి ఉగ్రరూపం దిశగా ప్రవహిస్తుండటంతో ఇప్పటికే భద్రాచలం-చర్ల, భద్రాచలం-ఏపీలోని కూనవరం రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దుమ్ముగూడెం మండలం తూరుబాక అప్రోచ్ రోడ్డు పైకి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. అలాగే గత కొన్ని రోజులుగా పర్ణశాల సీతమ్మనార చీరల ప్రాంతం నీట మునిగే ఉంది. అదేవిధంగా భద్రాచలం నుంచి ఏపీలోని కూనవరం వైపు వెళ్లే మార్గంలో మురుమూరు పొలిపాకల వద్ద రహదారులపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

కల్యాణకట్ట కింది భాగంలోకి వరద నీరు



స్నానఘట్టాల వద్ద భక్తులు

గోదావరి వరద కరకట్ట వద్ద ఉన్న భద్రాచలం దేవస్థానం కల్యాణ కట్ట కింది భాగంలోకి వరద నీరు వచ్చి చేరింది. అలాగే స్నానఘట్టాలు సైతం పూర్తిగా నీట మునగడంతో భక్తులు స్నానాలు చేసేందుకు అనుమతించడం లేదు. గోదావరి ఉధృత స్థాయి నుంచి ఉగ్రరూపం దిశగా ప్రవహిస్తుండటంతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

గోదావరి వరద పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. డివిజన్‌లోని సెక్టోరియల్ అధికారులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రమ్‌కుమార్‌సింగ్‌లు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. భద్రాచలం కరకట్ట వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు చర్ల, దుమ్ముగూడెం తదితర మండలాల్లో గోదావరి వరద సమీపంలోకి ఎవరు వెళ్లవద్దని, వ్యవసాయ పనులకు వెళ్లే వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

64 ఏళ్లల్లో 15 సార్లు తొలి ప్రమాద హెచ్చరిక

సెప్టెంబరు నెలలో గోదావరి తొలి ప్రమాద హెచ్చరికను గత 64 ఏళ్లల్లో 15 సార్లు దాటింది. 2022 సెప్టెంబరు 13న 51.8 అడుగులు వచ్చిన గోదావరి నీటిమట్టం అనంతరం ఈ ఏడాది తుది ప్రమాద హెచ్చరిక 53 అడుగులకు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ఏడుసార్లు చివరి ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులను భద్రాచలం వద్ద గోదావరి దాటింది.

తూరుబాక వద్ద రోడ్డెక్కిన వరదనీరు

దుమ్ముగూడెం (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతుండడంతో తూరుబాక డైవర్షన్ వద్ద ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. దీంతో భద్రాచలం-చర్లల మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు రాకపోకలను నిలిపివేశారు. అలాగే పర్ణశాల నారచీరల ప్రాంతం వద్ద దుకాణాల వద్దకు వరదనీరు చేరింది. లోలెవల్ చప్టా పైకి నీరు చేరడంతో సున్నంబట్టి-బైరాగులపాడుల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



మునిగిన పర్ణశాల నారచీరలు

అటవీ సంరక్షణతో జీవనోపాధి

- వన సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఎర్రుపాలెం, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాలలో చెట్లను పెంచి అటవీ సంరక్షణకు కృషిచేస్తున్న వనసంరక్షకుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర రేంజ్‌పరిదిలో ఎర్రుపాలెం మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామంలో గల వనసంరక్షణ సమితి సభ్యులకు వివిధ రకాల జీవనోపాధి పరికరాలు, యూనిట్లను మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అందించారు. ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించడంలో వీఎస్ఎస్ ల పాత్ర కీలకమైందన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచి తద్వారా వచ్చిన ఆదాయంతో జీవనోపాధి సమకూర్చుకుని గ్రామాభివృద్ధికి తోపడడడం అభినందనీయమన్నారు. అటవీ సంపద పోడు వ్యవసాయభూములుగా మారకుండా వాటిలో చెట్లన పెంచి అడవులను సంరక్షణకు చర్యలు తీసుకుంటున్న అటవీశాఖ అధికారులను ఆయన అభినందించారు. ఎర్రుపాలెం మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామంలోని రైతులతో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో వన సంరక్షణ సమితి ఏర్పాటుచేసి 2012లో 25హెక్టార్ల అటవీ భూమిలో అటవీ అధికారులు జామాయిల్ మొక్కలు నాటించారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో 13 ఏళ్ల తర్వాత ఈటెండర్ ద్వారా జామాయిల్ కలప నరికించి అమ్మకాలు జరిపారు. ఈ కలప ద్వారా 1816.17మె.టగాను సుమారు 1కోటి 84లక్షలాదాయం వచ్చిది. దానిలో కోత పొందిన ఆదాయానికి సగం వాటా 234 మం ది వనసంరక్షణ సమితి సభ్యులకు రూ.90లక్షల 85వేల ను వారి ఖాతాలలో జమచేశారు. ఆ మొత్తంతో వారి జీవనోపాధి నిమిత్తం 115 పవర్‌టిల్లర్లు, 10 రోటావేటార్లు, 11ట్రాక్టర్ కల్టివేటర్లు ఇతర పరికరాలను భట్టి అందించారు. ఈ కార్యక్రమలో మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర రేంజర్ బి.శ్రీనివాసరెడ్డి, ఉపరేంజర్ వెంకటలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి, నాగిరెడ్డి, రాజీవ్‌గాంధీ, అటవీ సిబ్బంది సురేష్, ఫకీరయ్య, రాజేందర్, విజయ్‌లలిత, లింగేష్, రమేష్, సత్యకృష్ణ పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న దర్శకుడు కొరటాల శివ



భద్రాచలం సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు కొరటాల శివ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామాలయంలో ఆయన సామాన్య భక్తుడిలా స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. పలు సూపర్ హిట్ చిత్రాలకు కొరటాల శివ దర్శకత్వం వహించారు.

మణుగూరులో హైనా సంచారం

వివరాలు సేకరిస్తున్న అటవీ సిబ్బంది



మణుగూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు పట్టణ ప్రాంతంలోని సీఎస్‌పి లారీ యార్డు సమీపంలో సోమవారం హైనా అనే అడవి జంతువు సంచరించినట్లు స్థానిక లారీ డ్రైవర్లు తెలిపారు. వారికి హైనా కన్పించినట్లు తెలుపగా ఫారెస్టు బీట్ సెక్షన్ అధికారులు ఈ విషయంపై లారీ యార్డు సమీపంలో ఉన్న పరిసరాలను పరిశీలించారు. పాద ముద్రలను సేకరించేపనుల్లో నిమగ్నమైయ్యారు. హైనా వల్ల కొంత ప్రాణ హాని కలిగే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మద్యం దుకాణాలకు ఒకటే దరఖాస్తు

చుంచుపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం దుకాణాలు కోసం ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో సోమవారం ఎట్టకేలకు బోణీ అయింది. అశ్వారావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఓపెన్ క్యాటగిరిలో దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ కార్యాలయ అధికారులు వెల్లడించారు.

గంజాయి పట్టివేత

బూర్గంపాడు/భద్రాచలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిదిలో సోమవారం బూర్గంపాడు పోలీసులు గంజాయి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడు మండల పరిదిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఎస్ఐ ప్రసాద్ సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అటు వైపుగా వెళ్తున్న కారులో తరలిస్తున్న సుమారు 205కేజీల గంజాయిని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు హర్యానా రాష్ట్రానికి చెందిన వ్యక్తిని, కారును అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ 1.02కోట్లు వరకు ఉంటుందని పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

భద్రాచలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు స్థానిక ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 10.2 కేజీల గంజాయితో ద్విచక్ర వాహనంపై వస్తు న్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అనంతరం వీరిని ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు స్థానిక ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో సూర్యపేటకు చెందిన గోళ్ల గణేష్, ఒడిశాకు చెందిన మూరగుండ్ల ఆనంద్ ఉన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుల్ సుదీర్, వెంకట్, హన్మంరతావు, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రాయితీలను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర పంటలుగా వేసుకున్న ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీని కల్పిస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన పట్టుపరిశమ అధికారి జంగ కిశోర్ కోరారు. సోమవారం ఆయన అశ్వారావుపేట, దమ్మపేట మండలాలలో అంతర పంటలుగా వేసిన ఉద్యాన పంటలైన అరటి, కోకో తోటలను పరిశీలించారు. రాయితీకోసం ధరఖాస్తు చేసుకున్న పలువురు రైతుల తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేసారు. టీష్యూకల్చర్ అరటికి ఎకరానికి రూ.28వేలు, కోకోకు ఎకరానికి రూ.12వేలు ఆదాయం వస్తుందని రైతులు ఈ పంటలను అంతర పంటలుగా, నేరుగా కూడ వేసుకోవచ్చునని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటలను ఏ పద్దతిలో వేయాలి, ఆదాయం ఎంత వస్తుంది, ఎంత నికర ఆదాయం వస్తుందో రైతులకు వివరించారు.

చదువుల తల్లి .. సోనియా

- ఆరేళ్లలో ఎనిమిది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గిరిజన యువతి
- తాజాగా గ్రూప్-1, 2లలో ఉద్యోగాలు



మణుగూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణ ప్రాంతంలోని శేషగిరినగర్ ప్రాంతానికి చెందిన ధరావత్ సోనియా చదువులో రాణించిన ప్రతిభకు గ్రూప్ పోటీ పరీక్షలు దాసోహం అయ్యాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. చిన్న నాటి నుంచి చదువుపై ఉన్న మక్కువ పట్టుదల వెరసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది. ఇటీవల విడుదల అయిన గ్రూప్ 2 ఫలితాల్లో అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారిగా ఎంపికయ్యారు. అంతే కాకుండా గ్రూప్ వన్‌లో సైతం తన ప్రతిభను చాటారు. ఎంపీడీవోగా ఎంపికయ్యారు. పినపాక ఎల్చిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివిన తర్వాత మెరిట్ గల సోనియా ఐటీడీఏ డీఆర్‌డీఏ సహకారంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌ను పూర్తి చేసింది. పాల్వంచలోని కేఎస్ఎం లో బీటెక్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఎంఏ సోషయాలజీ డిగ్రీ పొందారు. 2018లో ఫారెస్టు బీట్ అధికారిగా, ఆతర్వాత వీఆర్‌వోగా, పంచాయతీ సెక్రటరీగా కూడా ఎంపికయ్యారు. 2020 లో రైల్వే ఎస్ఐ, సివిల్ ఎస్ఐగా సెలెక్ట్ అయిన సోనియా సివిల్ ఎస్ఐగా విధుల్లో చేరారు. ఖమ్మం వేంసూరు మండలాల్లో ఎస్ఐగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రూప్స్‌కు ప్రిపేర్ అయి గ్రూప్ 2 గ్రూప్ 1లో తన సత్తాను చాటారు. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా, ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఎంపీడీవోగా జాయిన్ అయ్యే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. కష్టపడి చదువుకుంటే తనలా ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాదించవచ్చని తెలిపారు. పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సాదించవచ్చని తెలిపారు.



పాలపిట్ట పరిరక్షణ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలపిట్ట.. రైతు నేస్తం

- పాలపిట్ట పరిరక్షణకు కల్లూరు వాసి ప్రచారం
- రాష్ట్ర అటవీశాఖ అధికారి శంకరన్‌తో పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాలపిట్ట రైతునేస్తం. దసరా పండుగ రోజున పాలపిట్ట కనిపిస్తే శుభం అని మన సంస్కృతిలో విశ్వసిస్తారు. అందుకే ఇది ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతతో పాటు ప్రకృతి పరిరక్షణలోనూ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని కల్లూరు ప్రాంతానికి చెందిన గ్రీన్ వారియర్ జేవీఎస్ చంద్రశేఖర్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ప్రకృతిలో పాలపిట్ట ప్రాధాన్యతపై ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపట్టిన ప్రచార ఉద్యమంపై సోమవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ వన్యప్రాణి అధికారి శంకరన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భారతదేశంలో 1300పైగా పక్షి జాతులు ఉన్నాయన్నారు. వాటిలో 342 జాతులపై సర్వే చేయగా 178 జాతులు ప్రమాదంలో, లేకుంటే అంతరించి పోతున్న వర్గంలో చేరుతున్నాయని నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. పాలపిట్ట కూడా అందులో ఒకటి కావడంతో.. దాని సంరక్షణ చాలా అవసరం ఉందని తెలిపారు.



సద్దుల సంబురం

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన పూల పండుగ
- అంబరాన్నంటిన సంబరాలు
- మున్నేరులో కోలాహలంగా నిమజ్జనం
- నాయకన్‌గూడెం వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెం సాంస్కృతికం /ఖమ్మంఖానాపురం హవేలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ సంబరాలు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో పూల వైభవాన్ని చాటాయి. ఒక్కేసి పువ్వేసి చందమా మ.. ఒక్కజాము లాయే చందమామ.. అంటూ బతుకమ్మ పాటలతో పల్లె, పట్టణ వీధులన్నీ మార్మోగాయి. ఎక్కడ చూసినా.. పూల పరిమళం గుబాళించింది. తె లంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సాంప్రదాయ పట్టు వస్త్రాలను ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లతో బతుకమ్మ పాటలను పాడారు. అనంతరం బతుకమ్మలను ఎత్తుకొని వెళ్లి సమీపంలోని నిమ్మజ్జగాట్లవద్ద కాసేపు బతుక మ్మ ఆడిపాడి చెరువులు, కుంటలు, వాగుల్లో వెళ్లిరావమ్మా.. మళ్లీ రావమ్మా అంటూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కొత్తగూడెంలోని ముర్రేడు ఘాటు, గోధుమవాగు, రుద్రంపూర్‌లోని దన్‌బాద్‌చెరువులతోపాటు సుజాతనగర్ లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మహిళలు తమ వెంట తెచ్చుకున్న సత్తుపిండి ప్రసాదాలను ఒకరినొకరు వాయినంగా సమర్పించుకుని ఆత్మీయతను చాటుకున్నారు. పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. వేర్వేరుగా జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సీతాలక్ష్మీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు, బతుకమ్మ ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోనేరు పూర్ణచందర్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, పెద్దబాబు, శ్రీనగర్ మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్ పాల్గొని ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పలు అమ్మవారి మండపాల వద్ద, ఆలయాలలో నిర్వహించిన వేడుకలు సోమవారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్, పర్ణశాల కాల్వోడ్డు అంజనేయ స్వామి ఆలయం, టీడీపీ జిల్లా కార్యాలయంలో, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంతోపాటు నగరంలోని పలు ప్రాంతాలలోని నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. 9 రోజుల పాటు సాగిన ఈ బతుకమ్మ వేడుకల్లో చివరి రోజున సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఊరూ వాడ ఎటు చూసినా పెద్ద పెద్ద బతుకమ్మలు కనువిందు చేశాయి. ఆటపాటలతో గౌరమ్మను ఆరాధించి గంగమ్మ ఒడికి చేరాయి.



భద్రాచలంలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు



బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి



పర్ణశాల వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు

బతుకమ్మలకు ఘనంగా వీడ్కోలు పలికి కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌లోని మున్నేరులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. నిమజ్జన ఘాట్‌ల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

కూసుమంచి : మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈవేడుకల్లో రెవిన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మహిళలతో ఆడిపాడారు. ఈసందర్భంగా మంత్రి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులు తీరొక్కపూలతో గౌరమ్మను ఘనంగా పూజించి సకల జనులు సబ్బండ వర్గాల సమైక్య స్ఫూర్తిని సద్దుల బతుకమ్మ పండుగ చాటుతుందన్నారు. ఈసందర్భంగా మహిళలకు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు.

99శాతం హామీలను నెరవేర్చాం..

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

ప్రజలు ఆదరిస్తారు.. ఆశీర్వదిస్తారు..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హమీలను అధకారంలోకి వచ్చాక 99శాతం నెరవేర్చామని, అందుకే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదిస్తారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఆర్థిక, పాలనా వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రణాళిక ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రంలో యువత, రైతులు, మహిళల కోసం తాము చేపట్టిన సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాలు వారి మనసుకి బాగా తెలుసనని సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, ప్రజా ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరిక నెరవేర్చిందని వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ కలిపించిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నవారు రైతు రుణమాఫీ చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేశామని పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌తో పాటు గృహాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. అందుకే కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తారన్న సంపూర్ణ విశ్వాసముందన్నారు. 96 లక్షల కుటుంబాలకు తాము సన్నబియ్యాన్ని ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాలకు రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని వచ్చే ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు.

ఖమ్మం జిల్లా		
మండలం	పంచాయతీలు	వార్డులు
మొదటి విడతలో..		
కూసుమంచి	41	364
తిరుమలాయపాలెం	40	356
ఖమ్మం రూరల్	21	202
ముదిగొండ	25	246
నేలకొండపల్లి	32	300
కామేపల్లి	24	218
రెండో విడతలో..		
ఏన్కూరు	25	216
తల్లాడ	27	252
కల్లూరు	23	214
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
వేంసూరు	26	244
సింగరేణి	41	356
మూడో విడతలో..		
రఘునాథపాలెం	37	308
కొణిజర్ల	27	254
వైరా	22	200
ఎర్రుపాలెం	31	284
మధిర	27	236
బోనకల్	22	210
చింతకాని	26	248
మొత్తం	571	5214

మూడు విడతల్లో 'పల్లె' పోరు

- ఖమ్మం జిల్లాలో 571, భద్రాద్రి కొత్తగూడెంలో 471 పంచాయతీలు

కొత్తగూడెం/ ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో హడావిడి మెదలయ్యింది. అధికారులు ఓటర్ల జాబితాలు, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పంచాయతీల్లో ఓటర్లు, వార్డుల సంఖ్య ఆధారంగా వార్డు సభ్యులు, సర్పంచి పదవులకు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ముందుగానే ముద్రించి సిద్ధం చేశారు. బ్యాలెట్ పత్రాల్లో అభ్యర్థుల పేర్లు ఉండవు. కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. ఓటర్ల సంఖ్యకు, స్థానాలకు 10 శాతం అదనంగా బ్యాలెట్ పత్రాలు సిద్ధంగా పెట్టారు. వీటిని డీపీఆర్వీ భవనంలో భద్రంగా పెట్టారు. ఖమ్మం జిల్లాలో ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో మొత్తం ఓటర్లు 8,02,690 ఉండగా 571 పంచాయతీల్లో 5,214 వార్డులకు గాను 5,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచే శారు. ఇక భద్రాద్రి జిల్లాలో మొత్తం 471 పంచాయతీలు, 4,168 వార్డులకుగాను 4,242 పోలింగ్ కేంద్రాల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ జిల్లాలో మొత్తం 6,69,048 మంది ఓటర్లున్నారు.

'స్థానిక' ఎన్నికల ప్రక్రియ ఇలా..

మొదటి విడత ఎన్నికలు జరిగే మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థానాల్లో నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 9నుంచి 11వరకు, పరిశీలన 12న, ఉపసంహరణ 15న, 23న పోలింగ్ జరుగుతుంది. ఇక రెండో విడతలో ఎన్నికలు జరిగే చోట్ల నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 13నుంచి 15వరకు, పరిశీలన 16న, ఉపసంహరణ గడువు 19వతేదీ. 27న పోలింగ్ జరగనుండగా.. ఈ రెండు విడతలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నవంబరు11న ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇలా..

మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో అక్టోబరు 17 నుంచి 19వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 20వ తేదీన పరిశీలన, ఉపసంహరణ 23 ఉంటాయి. 31వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలుంటాయి.

రెండో విడతకు సంబంధించి అక్టోబరు 21నుంచి 23 వరకు నామినేషన్లు, 24న పరిశీలన, ఉపసంహరణ 27న ఉంటాయి. నవంబరు4న పోలింగ్, అదే రోజున ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి.

మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయితీల్లో అక్టోబరు 25నుంచి 27వరకు నామినేషన్ల స్వీకరణ, 28న పరిశీలన, ఉపసంహరణ 31న జరుగుతాయి. నవంబరు 8న పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

భద్రాద్రి జిల్లా		
మండలం	పంచాయతీలు	వార్డులు
మొదటి విడతలో..		
అశ్వాపురం	24	214
భద్రాచలం	01	20
బూర్గంపాడు	18	182
చర్ల	26	232
దుమ్ముగూడెం	37	324
కరకగూడెం	16	130
మణుగూరు	14	132
పినపాక	23	202
రెండో విడతలో..		
అన్నపురెడ్డిపల్లి	10	98
అశ్వారావుపేట	27	234
చంద్రుగొండ	14	134
చుంచుపల్లి	18	168
దమ్మపేట	31	290
ముల్కలపల్లి	20	186
పాల్వంచ	36	282
మూడో విడతలో..		
ఆళ్లపల్లి	12	90
గుండాల	11	96
జూలూరుపాడు	24	198
లక్ష్మీదేవిపల్లి	31	260
సుజాతనగర్	13	110
టేకులపల్లి	36	312
ఇల్లెందు	29	274

42శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో మండలాల వారీగా సోమవారం ప్రార్టీ శ్రేణులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో మొదటి విడతలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం ఆయాగ్రామాల్లోని ప్రతీ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఏప్రభుత్వం చేయనివిధంగా కాంగ్రెస్‌పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు జీవో జారీచేసి ఎన్నికలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఆ జాబితా ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని, తమ ప్రభుత్వం ఇచ్చిన జీవోను కొందరు హైకోర్టులో సవాలుచేశారని, అక్టోబరు 8న హైకోర్టు తీర్పు వెలువడనుందని, ఆతీర్పును స్వాగతిస్తూ కోర్టుతీర్పుకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. గడిచిన 21నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిందని, అవే అభ్యర్థుల విజయానికి బలమవుతాయన్నారు. గ్రామాల్లో విబేధాలున్నా వాటిని చర్చలతో పరిష్కరించి ఐక్యతతో ముందుకుసాగాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత కోసం 9మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఒకేగ్రామంనుంచి అనేక మంది ఆశావహులు ఉన్నప్పుడు గెలుపు అవకాశాలు, పార్టీపై విధేయతను పరిగణనలోకి తీసకుకొని అభ్యర్థులను ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దక్షిణ అయోధ్యలో విజయదశమి వేడుకలు

- 2న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహణ
- శ్రీరామ మహా పట్టాభిషేకం, శమీ పూజ
- శ్రీరామలీలా మహోత్సవానికి ఏర్పాట్లు

భద్రాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యో తి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అక్టోబర్ 2న విజయదశమి వేడుకలను నిర్వహించనున్నా రు. అలాగే స్థానిక దసరా మండపంలో శ్రీ రామలీలా మహోత్సవం నిర్వహించేందు కు ఏర్పాట్లు చేస్తున్నారు. రాక్షసులపై దైవశక్తులు పోరాడి విజయం సాధించిన రోజే విజయ దశమిగా పురాణ గాధలు పేర్కొంటున్నాయి. శ్రీరామ చంద్రుడు విజయదశమినాడే యుద్ధానికి బయలుదేరి విజయం సాధించాడని, అలాగే శ్రీరాము డు నవరాత్రి ఉత్సవాలను ఆచరించారని దాని ఫలితంగానే రావణాసురుడిని సంహరించారని కాళికాపురాణం తదితర శక్తి సంబంధిత గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అందువల్లే ఉత్తరాదిలో రామ్‌లీలా మహోత్సవం రావణాసుర ప్రతిమ దగ్ధం చేస్తారు. అర్జునుడు ఉత్తర గోగ్రహణ సమయంలో కౌరవుల పై ఆరోజునే విజయం సాధించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. ఇదే రీతి లో అమ్మవారు మహిషాశురుడిని సంహరించి విజయం సాధించింది కూడా విజయ దశమి నాడే. దీంతో విజయదశమి రోజున ఆయుధ పూజను క్షత్రియులు, పుస్తక పూజను విజ్ఞాన కాముకులు ఈ విజయదశమిరోజే నిర్వహిస్తారు. అనాదిగా విజయయాత్రను విజయదశమినాడే ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది.

రావణుడిపై శ్రీరాముడి విజయానికి చిహ్నంగా..

విజయదశమిని దసరా అని కూడా పిలుస్తారు. దశకంఠుడైన రావణునిపై శ్రీరాముడు విజయాన్ని సాధించినందుకు చిహ్నంగా ఈ పండుగకు దశకంఠహర అని పిలిచేవారు. కాలక్రమేణా దసరాగా ప్రచారంలోకి వచ్చింది. దీంతో శ్రీరాముడు రావణుని చంపే విధానాన్ని గుర్తుచేస్తూ ఉత్తర హిందూ దేశంలో శ్రీరామలీలా ఉత్సవాన్ని విజయదశమినాడే నిర్వహిస్తారు. ఇదే రీతిలో దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచలం దివ్యక్షేత్రంలో అష్టలక్ష్మీ పూజలను, శ్రీరామాయణ పారాయణోత్సవాన్ని జరిపి విజయదశమినాడు శ్రీరామ చంద్ర మహాప్రభువుకు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత సంధ్యావేళా సమయంలో విజయ యా త్ర,శమీ పూజ, ఆయుధ పూజ జరిపి శ్రీరామలీలా ఉత్సవాన్ని జరుపుతారు. శరత్‌రుతువు ఆరంభంలో జరిపే ఈ ఉత్సవాలు సర్వ దేవతలకు ప్రీతికరమైనవే. ఈ కాలంలో అమ్మవారిని శ్రీరామచంద్రున్ని పూజించుట సర్వశ్రేష్ఠం. ఎవరైతే స్వామి వారికి సమర్పించిన శమీ పత్రాలను శిరస్సున ధరిస్తారో వారికి విజయాలు దక్కుతాయని పాంచరాత్రాగమంలో పేర్కొనబడింది.

ఖమ్మం జిల్లాలో రిజర్వేషన్లలో చిత్ర విచిత్రాలు

ఖమ్మం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతి నిధి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రక్రియలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల రిజర్వు అయిన ఓటర్లు లేకపోయినా.. అక్కడ సీటు రిజర్వ్ చేయడంతో ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది.

- పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం మంగలితండాలో అంతా గిరిజనులే. 829మంది గిరిజన ఓటర్లున్నారు. ఇక్కడ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు అయింది. ఈ పంచాయతీలో బానోత్ అనిత అనే బీసీ మహిళ గతేడాది గిరిజన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. దీంతో ఆమెకు సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా దక్కనుంది. భర్త సైదులతో కలిసి ఓటర్లుగా మంగలితండాలో ఉన్నప్పటికి హైదరాబాద్‌లో రోజువారీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. బీసీ మహిళకు ఒక్క ఓటరే ఉండడంతో సోమవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈమహిళకు కాంగ్రెస్ కండువా కప్పిపార్టీలో చేర్చుకున్నారు. ఇక్కడ బీసీకి కేటాయించిన వార్డు పదవులు కూడా ఖాళీగా ఉండనున్నాయి.
- ఇదే కూసుమంచి మండలంలోని ధర్మాతండా బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ గిరిజన ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇక్కడ కుమ్మరికుంట్ల నాగరాజు అనే యువకుడు పక్కనే ఉన్న కేశ్వాపురం గ్రామం నుంచి తన భార్యతో కలిసి ధర్మాతండాకు వలసవచ్చి నర్సరీ నడుపుతున్నారు. ఈపంచాయతీలో నాగరాజుతో పాటు ఆయన భార్య మాత్రమే బీసీ ఓటర్లుగా ఉండడంతో నాగరాజుకు ఈ పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా దక్కే అవకాశం ఉంది. దీంతో నాగరాజుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.
- మధిర నియోజకవర్గం చింతకాని మండలం రాఘవాపురం పంచాయతీలో ఓసీ ఓటర్లు అధికంగా ఉన్నారు ఇక్కడ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. అయితే ఈ పంచాయతీ మొత్తం మీద ఎస్సీ ఓటర్లు ఇద్దరే ఉండడం, వారుకూడా తల్లీకొడుకు రావడంతో వీరిద్దరికి పదవులు దక్కబోతున్నాయి. సర్పంచ్ పదవికి కాంపల్లి కోటమ్మ ఎస్సీ మహిళ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా దక్కించుకోనుంది. ఎస్సీ జనరల్ వార్డుగా 4వవార్డు కాంపల్లి దావీదు ఎన్నిక వుతుండగా రెండోవార్డులో ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో ఎవరు లేకపోవడంతో ఖాళీగా ఉండనుంది.
- సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలంలోని ఉప్పలచలక గ్రామపంచాయతీ షెడ్యూల్ ఏరియాలో ఉన్నందున సర్పంచ్‌తోపాటు 4వార్డు పదవులు ఎస్టీకి రిజర్వు అయ్యాయి సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. ఈ పంచాయతీలో ఎస్టీ కుటుంబం ఒక్కటే ఉంది. అందులో ముగ్గురు ఓటర్లుండగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నందున వారు పోటీకి దూరంగా ఉంటున్నారు. ఇంటిలో రుద్రజారాణి అనే యువతి ఒక్కరే సర్పంచ్ పదవికి పోటీచేసే అవకాశం ఉంది. గతంలో కూడా ఈపంచాయతీలో ఎవరు ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైంది. మళ్లీ రెండోసారి కూడా సర్పంచ్‌గా రుద్రజారాణి పోటీపడనుంది. మిగిలిన వార్డులు ఖాళీగా ఉన్నాయి. గత పంచాయతీలో కూడా 4వార్డులు ఖాళీగా ఉన్నాయి.
- వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయతీ షెడ్యూల్ ఏరియాలో ఉంది. దీంతో ఇక్కడ సర్పంచి పదవితోపాటు నాలుగు వార్డులు ఎస్టీకి రిజర్వు అయి ఉన్నాయి ఈపంచాయతీలో ఎస్టీ ఓటర్లు లేరు. దీంతో సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. నాలుగు వార్డులు ఖాళీగా ఉండే పరిస్థితి. గత ఎన్నికల్లో కూడా ఈపంచాయతీల్లో సర్పంచ్ పదవితోపాటు ఎస్టీ వార్డులు ఖాళీగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే ఆనవాయితీగా వస్తోంది.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

వీసీలో ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని

ఖమ్మం కలెక్టరేట్ /కొత్తగూడెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణికుముదిని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆమె సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. రెండు విడతలలో స్థానిక సంస్థలను, 3 విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే ప్రాంతాలలో అమలులోకి వస్తుందన్నారు. ఆ తర్వాత ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థలు రెండు విడతలలో, గ్రామ పంచాయతీ 3 విడుతలలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. 183 గ్రామాలకు మొదటి దశలో, 196 గ్రామాలకు రెండవ దశలో, 192 గ్రామాలకు మూడో దశలో ఎన్నికలు జరుగుతాయన్నారు. 10 మండలాల చొప్పున రెండు దశలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

ఒక్క ఓటుతో సర్పంచ్ పదవి

- ఇద్దరు బీసీ అభ్యర్థులకు కలిసి వచ్చిన అదృష్టం
- మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- అధికార పార్టీ ఖాతాలోకి రెండు పంచాయతీలు ?



మంత్రి పొంగులేటి సమక్షంలో కండువాలు కప్పుకున్న నాగరాజు, అనిత



కుమ్మరికుంట్ల నాగరాజు, ధర్మాతండా



బాణోతు అనిత, మంగలతండా

కూసుమంచి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో అవి అతి చిన్న పంచాయతీలు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 500జనాభా దాటిన తండాలన్నీ గ్రామ పంచాయతీలుగా మార్చడంతో ఏర్పడ్డాయి. అందులో ఒకటి మంగలతండా , మరొకటి ధర్మాతండా. ఈ రెండు తండాలు కావడంతో అక్కడ మొత్తం అత్యధికశాతం ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారే. ఒక్కో కుటుంబం అక్కడ నివాసం ఏర్పాటు చేసుకోవడం వారికి కలిసివచ్చాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ పుణ్యమా అని వారిని సర్పంచ్ పదవులు వరించనున్నాయి. మండలంలోని మంగలతండాలో మొత్తం 828 మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఒక్క బీసీ మహిళ, ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. అయితే మూడేళ్ల క్రితం ఇదేతండాకు చెందిన జీళ్ల అనితను బాణోతు సైదులు ప్రేమవివాహం చేసుకున్నాడు. అనంతరం గత అసెంబ్లీఎన్నిల సందర్భంగా ఓటరుగా నమోదు చేసుకున్నారు. దీంతో తండా రిజర్వేషన్ ప్రకారం బీసీ మహిళలకు కేటాయించడంతో అదృష్టవశాత్తు సర్పంచ్ పదవి వరించనుంది. వారు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తారు. ధర్మాతండాలో మొత్తం 460 మంది ఓటర్లున్నారు. అందులో ఇద్దరు భార్యభర్తలు బీసీలు మినహా మిగిలిన ఓటర్లందరూ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు. కేశ్వాపురం గ్రామానికి కుమ్మరికుంట్ల నాగరాజు ధర్మాతండా వద్ద నర్సరీ ఏర్పాటుచేసుకుని కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తమ ఓట్లను ఇక్కడే నమోదు చేయించుకున్నారు. తల్లితండ్రుల ఓట్లు కేశ్వాపురంలోనే ఉన్నాయి. రిజర్వేషన్ల పుణ్యమా అని బీసీ జనరల్ కేటాయించడంతో నాగరాజుకు సర్పంచ్ పదవి దక్కనుంది.

కాంగ్రెస్ ఖాతాలో రెండు స్థానాలు?

గ్రామపంచాయతీ ఎన్నికల్లో రెండు స్థానాలు అప్పుడే కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. రిజర్వేషన్ కారణంగా ఒక్కొక్కరు మాత్రమే ఉండటంతో ధర్మాతండా, మంగలతండా రెండు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ధర్మాతండా నుంచి కుమ్మరికుంట్ల నాగరాజు, మంగలితండానుంచి బాణోతు అనిత ఏకగ్రీవం కానున్న నేపథ్యంలో.. వారు ముందుగానే రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆకాంక్షించారు.



పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రాందాస్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీకార్మికులకు బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూసోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అడిషనల్ ,డీపీవోలకు వినతిపత్రాలుసమర్పించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు అప్పారావు, మీగడ సైదులు, కత్తుల భిక్షం, చిట్టెం సైదులు, జోగా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): అర్హులందికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జలగంనగర్‌లో దాతల సహకారంతో నిర్మిస్తున్న పాఠశాల భవనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. గతంలో ఏప్రభుత్వం చేపట్టలేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తే కమీషన్‌లు రావన్న ఉద్దేశంతో కట్టించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్‌కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



అమ్మగూడెంలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నేలకొండపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు కుటుంబాలను పరామర్శించారు. అమ్మగూడెం నుంచి కోనాయగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు, సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవలరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోరట్లగూడెం గ్రామానికి చెందిన మీసాల సన్నీప్రసాద్, బచ్చలకూర మనోజ్‌ల కుటుంబాలను పరామర్శించారు. మంత్రిపర్యటనలో ఉండగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్న సమాచారం అందటంతో మంత్రి పొంగులేటి ఎక్కడా మాట్లాడలేదు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్,అడపాల రామారావు, బచ్చలకూరి నాగరాజు,బొడ్డు బొందయ్య, కట్టెకోల నాగేశ్వరరావు, కట్టెకోల నాగార్జున పాల్గొన్నారు.

మార్కెట్ ఈవోపై వ్యాపారి కుమారుడి దాడి

» వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఉద్రిక్తత
» పోలీసుస్టేషన్‌లో ఇరుపక్షాల ఫిర్యాదులు
» 210 దుకాణాలకు నెంబర్లు కేటాయించిన అధికారులు



దుకాణాలకు నెంబర్లు వేయిస్తున్న అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో వీధి వ్యాపారుల మార్కెట్ వివాదం ఓ కొలిక్కి వస్తున్న సమయంలో కొద్దిమంది వ్యాపారులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతో సోమవారం ఉదయం ఉద్రిక్తత ఏర్పడింది. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు వీధివ్యాపారుల మార్కెట్‌లో మార్కెటింగ్ ఎస్టేట్ అధికారి శివరామకృష్ణ కూరగాయల దుకాణాలకు నెంబర్లు కేటాయిస్తున్నారు. దుకాణం నిర్మాణంపై పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న దుకాణం యజమాని కుమారుడు ఎస్టేట్ అధికారి చొక్క కాలర్ పట్టుకొని దాడి చేశారు. కొద్దిసేపు ఉద్రిక్తతకు దారి తీసింది. తర్వాత ఎస్టేట్ అధికారి శివరామకృష్ణ జరిగిన వివాదాన్ని మార్కెటింగ్ అధికారులకు తెలియజేశారు. ఖమ్మం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత వ్యాపారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా వివాదం విషయం స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ ద్వారా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు తెలియటంతో ఆయన వెంటనే స్పందించారు. పోలీసుల భద్రతకు ఆదేశించారు. సాయంత్రం వీధి వ్యాపారుల ప్రాంగణంలో మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణితో కలిసి కూరగాయల దుకాణాలకు పోలీసు,డీఆర్ఎఫ్ బలగాల భద్రత నడుమ 210 కూరగాయల దుకాణాలకు నెంబర్లు కేటాయించారు. ఒకరిద్దరు వ్యాపారుల తీరు కారణంగానే మొత్తం మార్కెట్‌కు చెడ్డ పేరు వస్తుందని మార్కెట్‌లోని ఇతర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకమ్మ ఘాట్‌లను పరిశీలించిన మేయర్



బతుకమ్మ ఘాట్‌ను పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): మున్నేరు పరివాహకంలో బతుకమ్మ ఘాట్‌లను సుందరంగా నిర్మాణం చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. బతుకమ్మ నిమజ్జనం కోసం మున్నేరు పరివాహకంలో ఏర్పాటు చేసిన ఘాట్‌లను మేయర్ పునుకొల్లు నీరజ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఘాట్‌ల వద్దకు ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు అధికంగా వస్తుంటారని సరైన భద్రత పాటించాలని ఆదేశించారు. పారిశుద్యం, పరిశుభ్రత, తాగునీరు. లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. గజ ఈత నిపుణులు అందుబాటులో ఉంచాలని, మహిళలకు అనుకూలంగా కార్పేట్లు పెంచాలని, అవసరం మేరకు క్రేయిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈఈ కృష్ణలాల్, కాంగ్రెస్ నాయకులు కన్నేం ప్రసన్నకుమార్, గజ్జల వెంకన్న వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం

కాంగ్రెస్ నాయకులు, పోలీసులు వేధిస్తున్నారని సెల్ఫీ వీడియో

ఖమ్మం క్రైం,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు, పోలీసులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ తిరుమలాయపాలెం మండలం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు బాణోత్ రవి(ఆర్మీ రవి) సోమవారం ఖమ్మంలో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తిరుమలాయపాలెం మండలం సుద్దవాగు తండాకు చెందిన రవి గతంలో ఆర్మీలో విధులు నిర్వహించాడు. ప్రస్తుతం బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఓ సంఘటనపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు తనపై కక్ష పెట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు సుపారీ కూడా ఇచ్చినట్టు రవి ఓసెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కలెక్టరెట్‌వద్ద, సీపీ కార్యాలయం వద్ద ఈ ఘటన జరిగినట్లు ప్రచారం జరిగినా, ఎక్కడి అనేది పోలీసులకు కూడా తెలియరాలేదు. ఈ విషయం తెలిసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బాణోత్ చంద్రావతి బాధితుడు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ఓట్ల కోసం కులరాజకీయాలు

ఖమ్మంఅర్బన్ , సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసం ప్రభుత్వాలు కులరాజకీయాలకు పాల్పడుతున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.. సోమవారం మాస్‌లైన్ జిల్లా పార్టీ కార్యాలయం రామనర్సయ్య భవన్‌లో జరిగిన సత్యశోధక్ సభలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో మాస్‌లైన్ జిల్లానాయకులు పుల్లయ్య, ఆవుల అశోక్,బందెల వెంకయ్య, సీహెచ్‌శిరోమణి, ఆర్‌శివలింగం, ఝాన్సీ, శోభానాగేశ్వరరావు,లక్ష్మణ్, దేవల వెంకటేష్ పాల్గొన్నారు.

ఎవరిది నిర్లక్ష్యం?

» రోడ్లు మంజూరైనా తీరని రైల్వే కాలనీవాసుల వెతలు
» బురదమయమైన రోడ్లతో ప్రమాదాలు



జారి కింద పడిన మహిళ

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటుపాలేరు నియోజకవర్గంలో ఉంటూ, కార్పొరేషన్‌లో మొదటి డివిజన్‌గా ఉన్న కైకొండాయిగుడెంలోని పలు కొత్త కాలనీలను స్థానిక సమస్యలు వెంటాడుతున్నాయి. చివరకు మంత్రి మంజూరు చేసిన రోడ్లు, డ్రెయినేజీలను వేయటంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైకొండాయిగూడెం పరిధిలోని రైల్వే కాలనీ, విద్యానగర్, వినాయక నగర్లలో పలు అంతర్గత రోడ్లకు ఇటీవల సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయగా.. వీటిలో కొన్నిటి పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు వాటిని పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్నారు. ముఖ్యంగా పాండురంగాపురం నుంచి కలుపుతూ రైల్వే కాలనీలో ఉన్న ప్రధాన రహదారిని వదిలేసి అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లుగా మారుస్తున్నారు. ప్రధానరోడ్డును పట్టించుకోకపోవడంతో గుంతలమయమై వర్షం వస్తే అడుగు లోతున నీరు నిలవడం, చిత్తడిగా మారి వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. పాదచారులు కూడా జారి పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి కూడా సీసీ మంజూరైందని చెబుతున్నారని, కానీ సీసీ రోడ్డు వేయకపోవడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా ప్రధాన రహదారిని సీసీగా మార్చాలని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వేడుకుంటున్నారు.



రైల్వే కాలనీలో బురద

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎన్నికల సందడి

» జోరందుకున్న ప్రచారం
» నవంబరులో ఎన్నికలు





మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ ప్యానెల్, గాంధీచౌక్‌లోని కిరాణా షాపులో ప్రచారం నిర్వహిస్తున్న మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు ప్యానల్

ఖమ్మంమార్కెట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎన్నికల సందడి నెలకొంది. నవంబరులో జరిగే ఎన్నికలకు సంబంధించి బరిలో నిలిచే అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ఎన్నికల్లో ప్రధానంగా రెండు ప్యానల్లు పోటీలో ఉన్నాయి. ఒక ప్యానల్ నుంచి కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ అధ్యక్షుడిగా, గొడవర్తి శ్రీనివాసరావు సెక్రెటరీగా, ఉపాధ్యక్షుడిగా కురువెళ్ల కాంతారావు, జాయింట్ సెక్రెటరీగా బాదెరవి, ట్రెజరర్‌గా తూములూరి లక్ష్మీనర్సింహరావు పోటీ చేస్తున్నారు. మరో ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, సెక్రెటరీగా జీవై నరేష్, ఉపాధ్యక్షుడిగా బత్తిని నర్సింహరావు, జాయింట్ సెక్రెటరీగా ముత్యం ఉప్పల్‌రావు, ట్రెజరర్‌గా తల్లాడ రమేష్ ప్రధానంగా పోటీలో ఉన్నారు. ఛాంబర్‌లో మొత్తం 18 రకాల వివిధ వ్యాపార వర్గాల శాఖల నుంచి 1310 మంది వ్యాపారులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అభ్యర్థులు ఎన్నికలకు రెండు నెలలు ముందుగానే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తహతహలాడుతున్నారు. కాగా సోమవారం కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ వర్గం వ్యాపారులు వ్యవసాయ మార్కెట్‌లో యార్డులలో ఉన్న వ్యాపారులను కలిసి తమకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మేళ్ళచెర్వు వెంకటేశ్వర్లు వర్గం వ్యాపారులు గాంధీచౌక్‌లోని కిరాణా షాపుల యజమానులను కలిసి తమ ప్యానల్‌కు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

నేలకొండపల్లి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని అత్యంత పురాతనమైన శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో సోమవారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకుడు తూపురాణి మధుసూధనాచార్యులు, ఛైర్మన్ రమేష్, సభ్యులు మోర మల్లయ్య, కైలాసపు కోటేశ్వరి, అనంతు సత్యనారాయణ, కొండబాల రాంబాబు, చెరుకు సీతారాములు, పగిఇకత్తుల సత్యం తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
» డీఆర్డీవో ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపం, ప్రకృతిని అమ్మగా కొలిచే పండుగ బతుకమ్మ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తొమ్మిదిరోజు సోమవారం సాయంత్రం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్, కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో అట్టహాసంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమతో పూజించి మహిళలతో బతుకమ్మ ఆడి వారిని ఉత్తేజపరిచారు.

ఘనంగా దేవినవరాత్రులు వేడుకలు,

జిల్లాలో దేవినవరాత్రుల వేడుకలలో భాగంగా ఏడోరోజు సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలు జమ్మిబండ వద్ద అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో సరస్వతీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. రెడ్డిపల్లిలోని మారెమ్మ ఆలయంలో అమ్మవారు భద్రకాళీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఖానాపురం ప్రశాంతినగర్‌లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి అటుకులు, బెల్లం, కొబ్బరి, పాయిసం, పులిహోర తదితర ప్రత్యేక నైవేద్యాలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ అనుదీప్ దంపతులు



సరస్వతిదేవి అలంకరణలో మారెమ్మతల్లి



బతుకమ్మకు పూజ చేస్తున్న సీపీ



రైల్వే కాలనీలో..



నేలకొండపల్లిలో..



బతుకమ్మలను పేరుస్తున్న మహిళలు

దుర్గామాతా మండపాల వద్ద సరస్వతీ పూజ

కామేపల్లి: కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామంలో దుర్గామాత మండపాల విద్యార్థులు, చిన్నారులు సరస్వతి పూజ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇంటి పట్టా ఇవ్వాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఖచ్చితంగా అందేలా ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించాలని ఖమ్మం నగర పాలకసంస్థ కమిషనర్‌అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇంటి పట్టా కోసం ఓమహిళ సమస్యను వివరించగా మూడు రోజుల్లో పట్టా ఇవ్వాలని సంబందిత ఉద్యోగిని కమిషనర్ ఆదేశించారు. 48వ డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆధ్వర్యంలో నాయకులు విన్నవించారు. ఇంటి నెంబర్లు కేటాయింపు, తాగునీటి కనెక్షన్,రెవెన్యూనగరంలో ప్రభుత్వ స్థలాలు అక్రమణలపై ప్రజలు వినతులు అందించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్

బన్న ఐలయ్యకు మనకాలపు జాషువా సాహిత్య పురస్కారం

ఖమ్మంకానాపురంహవేలి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో నిత్య స్మరణీయుడు మహాకవి గుర్రం జాషువానిలుస్తాడని ప్రముఖ సాహితీవేత్త గన్నమరాజు గిరిజా మనోహరరాజు అన్నారు. ఆదివారం రాత్రి మహాకవి గుర్రం జాషువా130వ జయంతి సందర్భంగా జాషువా సాహిత్య వేదిక ఖమ్మం అధ్యక్షుడు ప్రముఖ కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రముఖ కవి విమర్శకులు పరిశోధకుడు, కేయూ తెలుగుశాఖ విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్యకు మనకాలపు జాషువా అవార్డును అందించారు. ఖమ్మం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సభలో ఇల్లందు, తొర్రూరు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ వై.చిన అప్పయ్య, బి.రాములు, కొత్తపల్లి గురుప్రసాద్, పంజాల అయిలయ్య, కిన్నెర వెంకటేశ్వర్లు, జాషువా సాహిత్య వేదిక కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి 6నెలల జైలు

ఖమ్మంలీగల్,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితులైన ఖమ్మం కవిరాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన సీహెచ్ సురేష్‌బాబు, వడిగా శిల్పశశికళారాణిలకు ఆరునెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి ఆరులక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి. బెక్కమ్‌రజని తీర్పు చెప్పారు. ఖమ్మం నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన ఫిర్యాది జె. రామజగ్గారావు వద్ద నిందితులు తమ వ్యాపార అవసరాల నిమిత్తం 2020లో రూ.6లక్షలు అప్పుగా తీసుకున్నారు. రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా 2021లో ఆరులక్షల రూపాయలకు చెక్కుజారీ చేశారు. ఈ చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా నిందితుల ఖాతాలో 'సరిపడా నగదు' లేనందున తిరస్కరణకు గురైంది. తరువాత ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రేవేటు కేసు దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.



ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సరస్వతీ దేవి పూజ



కొణిజర్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ దేవి పూజను ఏర్పాటుచేశారు. ఈ పూజా కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన మండపాల్లో సరస్వతీ దేవి ప్రత్యేక పూజలో చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై నేతలతో చర్చించిన భట్టి



నాయకులతో చర్చిస్తున్న భట్టి

చింతకాని, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గ పర్యటన అనంతరం హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో నాగులవంచలోని మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు నివాసానికి సోమవారం వచ్చారు. అక్కడ ఆయన మండల నాయకులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులకు భట్టి అభినందనలు తెలిపారు. రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఏఎంసీ ఛైర్మన్‌కు భట్టి సూచించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కంభం వీరభద్రం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఏఎంసీ ఛైర్మన్

వైరా: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ల గంగారావు సోమవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఆదివారం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గంగారావు సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మధిరలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కను శాలువాతో సన్మానించారు. అనంతరం గంగారావును భట్టి విక్రమార్క అభినందించారు. వైరా మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసర మైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.

ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు

కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్



సత్తుపల్లిలోని మదర్‌తెరిస్సా కళాశాలలో అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ కోరారు. సోమవారం ఆయన సత్తుపల్లి మండలం కొత్తూరులోని మథర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు. ఇక్కడే గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరిగిన నేపథ్యంలో మరలా ఇక్కడే నిర్వహించే అవకాశం ఉన్నందున అధికారులు పర్యటించారు. ఈ క్రమంలో రిసెప్షన్ కౌంటర్, కౌంటింగ్ సెంటర్ల ఏరాట్లపై తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో నాగేశ్వరరావులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

తల్లాడ: జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం సోమవారం తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి కళాశాలను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. కళాశాలలో రిసెప్షన్ కౌంటర్లు, కౌంటింగ్ కేంద్రాలు, వాటి ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల గురించి తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబులకు పలు సూచనలు చేశారు.

సుదీర్ఘకాలం తర్వాత పాలకవర్గం ఏర్పాటు

మార్కెట్‌యార్డు మరింత అభివృద్ధి చెందే అవకాశం

హర్షం వ్యక్తం చేసిన రైతులు

ఏన్కూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఏర్పాటయింది. నూతన పాలకవర్గం ఏర్పాటుకావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2021 నుంచి పాలకవర్గం లేక ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తుంది. డీఎంవో అలీమ్ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు, మూడు మార్కెట్ కార్యాలయాలకు ఒకే అధికారిని కేటాయించడంతో వారికి తలకు మించిన భారంగా మారింది. దీంతో మార్కెట్ యార్డు అభివృద్ధి కుంటుపడుతూ వస్తుంది. తొలిసారి 2003లో ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడింది. మొదట మార్కెట్ కమిటీకి ఛైర్మన్ పదవిని జనరల్‌కు కేటాయించడంతో జన్నారం గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వరరావు ఆ తర్వాత రాజలింగాల గ్రామానికి చెందిన మోతుకూరి యాదగిరి పదవులు చేపట్టారు. ఆతర్వాత ఏజెన్సీ ప్రాంతంలో ఎస్టీలకు మాత్రమే కేటాయించాలని గిరిజనులు కోర్టును ఆశ్రయించడంతో 2017నుంచి ఎస్టీలకు రిజర్వు అయింది. ఆ తర్వాత 2021 నుంచి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని పాలకవర్గాన్ని ఏర్పాటు చేయించారు. నూతన పాలవర్గం ఏర్పాటుతో మార్కెట్ యార్డు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

కోటమైసమ్మ ఆలయంలో ఘనంగా అక్షరాభాస్యం

కారేపల్లి సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో కోటమైసమ్మ ఆలయంలో దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభిరామారావు, విజయలక్ష్మీ దంపతులు ముందుగా పూజలు చేవారు. అనంతరం ఆలయం పూజారి కైలాష్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు చిన్నారులకు అక్షరాభాస్య చేయించారు.

దుర్గాదేవీ మండపం వద్ద అన్నదానం

ముదిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవీ మండపాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిగొండ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్లాస్టింగులతో దెబ్బతింటున్న ఇళ్లు

తహసీల్దార్‌కు బాధితుల వినతి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బాంబ్ బ్లాస్టింగుల కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ సత్యనారాయణకు సోమవారం బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ పేదల ఇళ్లు బ్లాస్టింగులతో దెబ్బతింటునందున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విరాట్‌నగర్, వెంగళరావునగర్, ద్వారకాపురి కాలనీ, ఎన్టీఆర్ నగర్ వాసులు పాల్గొన్నారు.

వైఎన్ పురంలో మామిడి చెట్ల నరికివేత

రూ.50వేల నష్టం

కల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని యజ్ఞనారాయణపురం గ్రామంలో గుర్తుతెలియన వ్యక్తులు ఓ రైతుకు సంబంధించిన మామిడి తోటలో లేత మామిడి చెట్లను మొదళ్ల వరకు నరికివేచారు. ఈ సంఘటనపై బాధిత రైతు సోమవారం కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. మండలంలోని వైఎస్.పురం గ్రామానికి చెందిన రావి రాంబాబుకు సంబంధించిన మామిడి తోటలో ఆదివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దురుద్దే పూర్వకంగా సుమారు 16 మామిడి చెట్ల మొదళ్ల వరకు నరికారని సదరు రైతు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇలా చెట్లు నరకటంతో సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపాడు. సోమవారం ఉదయం తిరిగి తాను తోటలోకి వెళ్లి చూడగా మామిడి చెట్లు నరికిన సంఘటన వెలుగు చూసింది. దీంతో రాంబాబు ఆందోళనకు గురియై తగిన విచారణజరపి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన నూకల వేణు, నాగేశ్వరరావు, కృష్ణవేణి అను ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్ లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేణు ఇంటి ఎదురుగా ఉండే కోసూరి వీరయ్య ఆదివారం తన కుమారుడుని తిడుతుండగా మమ్మల్ని తిడుతున్నాడని వేణు, నాగేశ్వరరావు, కృష్ణవేణి అను ముగ్గురు కలసి వీరయ్యతో గొడవపడి అసభ్య పదజాలంతో దూషిస్తూ చేతులతో కొట్టి చంపుతామని బెదిరించారు. ఈ క్రమంలో వీరయ్యను వేణు నెట్టడంతో కిందపడి తలకు గాయమైంది. ఈ మేరకు వీరయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు చేయగా ఎస్ఐ వీరేందర్ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ కాంతుల్లో వైరా రిజర్వాయర్ రోడ్డు



వైరా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైరాలో ని రిజర్వాయర్ రోడ్డుపై విద్యుత్ కాంతులీనుతున్నాయి. జాతీయ ప్రధాన రహదారిలోని క్రాస్‌రోడ్డు నుంచి రిజర్వాయర్ కుడి కాల్వ హెడ్ స్లూయిజ్ వరకు రూ.90 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్‌ను శనివారం రాత్రి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. సెంట్రల్ లైటింగ్ తో పాటు త్రివర్ణ రంగులను తలపిస్తూ ఏర్పాటుచేసిన విద్యుత్‌దీపాల వెలుగులు కనువిందు చేస్తున్నాయి.

రిజర్వేషన్లతో ఖంగుతిన్న ఆశావహులు



పెనుబల్లి మండలపరిషత్ కార్యాలయం

పెనుబల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశించిన స్థానాలు వేరే సామాజిక వర్గాలకు రిజర్వు కావడంతో ఆశావహుల ఆశలు అడియాశలయ్యాయి. 2019లో రిజర్వేషన్లు అప్పటి ప్రభుత్వం రెండు పర్యాయాలు ఇవే రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రకటించింది. దాంతో 2019 నాటి రిజర్వేషన్లతోనే ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారంఎన్నికలు నిర్వహిస్తారని ఆశించి ఆయా రిజర్వేషన్లకు పోటీ చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు సిద్ధం అయ్యారు. కానీ తీరా ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించి ఆ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. గత రిజర్వేషన్ల ప్రకారం పెనుబల్లి ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు జనరల్‌కు రిజర్వు కాగా ప్రస్తుతం ఎంపీపీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కాగా, జడ్పీటీసీ బీసీ మహిళకు రిజర్వు అయింది. దీంతో గతంలో జనరల్ స్థానాలైనప్పటికీ ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పదవులు చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో కూడా అదే రిజర్వేషన్లు కొనసాగుతాయని అందుకు తగినవిధంగా అధికార, ప్రతిపక్షాలకు చెందిన నాయకులు ఎన్నికల్లో పోటీచేసేందుకు సమాయత్తమయ్యారు. కానీ అనుకొన్నదొక్కటీ.. అయిందొక్కటీ అన్న చందలా మారింది.

అయినా జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో కొంతమేరకు బీసీలకు ఊరట లభించినట్లయింది. కానీ జడ్పీటీసీ స్థానం కోసం ప్రతిపక్ష పార్టీ నుంచి ఓ మాజీ సర్పంచ్ పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ రిజర్వేషన్ మారిన నేపథ్యంలో తన భార్యను పోటీకి నిలిపే అవకాశముందని సమాచారం. మండల ప్రజలు ఊహించని విధంగా ఎంపీపీ ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో రాజకీయ ప్రధాన పార్టీల నాయకులు ఖంగుతిన్నట్లయింది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలకు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది.

ఆశావహుల్లో నైరాశ్యం...

మండలంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఇవే..

వైరా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెండు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. శనివారం వెలువడిన రిజర్వేషన్లతో ఆశావహుల ఆశలు ఒక్కసారిగా అడిశయాలయ్యాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి ఓసీకి లేక బీసీకి రిజర్వు అవుతుందని ఆశించగా ఎస్టీకి దక్కడంతో వారి ఆశలు గల్లంతయ్యాయి. ముఖ్యంగా ఉప ముఖ్యమంతి మల్లు భట్టి విక్రమార్క సహచరుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ జడ్పీ పీఠంపై ఆశలు పెట్టుకున్నారు. వైరా జడ్పీటీసీ స్థానం బీసీకి రిజర్వు అయినప్పటికీ జడ్పీ ఛైర్‌పర్సన్ ఎస్టీకి దక్కడంతో ఆయన ఆశించినది నెరవేరకుండా పోయింది. అలాగే వైరా ఎంపీపీ పదవిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి ఆశించారు. అయితే వైరా ఎంపీపీ బీసీకి రిజర్వు కావడంతో ఆయన ఆశలు అడిశలయ్యాయి. అలాగే పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ పదవులకు పోటీ చేసేందుకు రెండు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా తమ గ్రామాల్లో ఇతర సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో తీవ్ర నైరాశ్యానికి గురయ్యారు.

మండలంలోని ఎంపీటీసీల రిజర్వేషన్లులిలా...

వైరా ఎంపీపీ బీసీ జనరల్, ఎంపీటీసీలు గన్నవరం, పాలడుగు బీసీ జనరల్, సిరిపురం, విప్పలమడక బీసీ మహిళ, అష్టగుర్తి, ముసలిమడుగు ఎస్సీ జనరల్, రెబ్బవరం ఎస్సీ మహిళ, గరికపాడు, గొల్లపూడి ఓసీ జనరల్, తాటిపూడి ఓసీ మహిళకు రిజర్వు అయింది.

22 గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఇలా..

గోవిందాపురం, స్టేజీ పినపాక, గరికపాడు, విప్పలమడక బీసీ మహిళ, సిరిపురం, లింగన్నపాలెం, నారపనేనిపల్లి, గొల్లెనపాడు, వల్లాపురం బీసీ జనరల్, రెబ్బవరం, పుణ్యపురం, అష్టగుర్తి ఎస్సీ మహిళ, పాలడుగు, ముసలిమడుగు, గన్నవరం, కొండకొడిమ ఎస్సీ జనరల్, ఖానాపురం ఎస్టీ జనరల్, తాటిపూడి, కొష్టాల ఓసీ మహిళ, స్నానాల లక్ష్మీపురం, దాచాపురం, గొల్లపూడి ఓసీ జనరల్‌కు రిజర్వు అయ్యాయి.

ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికైన విజయ్



ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి ఎక్సైజ్ ఎస్ఐగా..

వైరా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కారుమంచి విజయ్ గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. గన్నవరంలో నిరుపేద కుటుంబం వారిది. వ్యవసాయ కూలీలుగా పనిచేసే కారుమంచి జయరాజు, ఎలీషమ్మల కుమారుడు విజయ్ ప్రస్తుతం సత్తుపల్లి ఎక్సైజ్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. బీటెక్ చదివిన విజయ్ 2012లో రైల్వేశాఖలో ట్రాక్‌మెన్‌గా మొదటి ఉద్యోగం సాధించాడు. ఆ తర్వాత 2014లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఓ వైపున ఉద్యోగం చేస్తూనే మరోవైపున పోటీ పరీక్షలకు చదివి గ్రూప్-2 ఫలితాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖలోనే ఎస్ఐగా సెలెక్ట్ అయ్యాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు గన్నవరం హైస్కూల్‌లో, ఇంటర్ మధిరలో, బీటెక్ పాల్వంచలో పూర్తిచేశాడు. తమ గ్రామానికి చెందిన విజయ్ ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపిక కావడం పట్ల గన్నవరం ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

గంగమ్మ చెంతకు బతుకమ్మ

వాడవాడలా సద్దుల బతుకమ్మ సంబురాలు



సత్తుపల్లిలో భారీ బతుకమ్మ ఊరేగింపు

మధిర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో సద్దుల బతుకమ్మ సంబరాలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం బతుకమ్మను గంగమ్మ చెంతకు మేళ తాళాలు, కోలాటాల నడుమ ఘనంగా సాగనంపారు. బతుకమ్మల ఆటలకు నేడు తొమ్మిదో రోజు కావడంతో అన్నిచోట్లా చిన్నా పెద్ద ఉత్సాహంగా బతుకమ్మ ఆటలు ఆడారు. మండపాల్లో దుర్గాదేవిని సరస్వతీ దేవీ అలంకారంలో పూజలు నిర్వహించారు. సుందరయ్య నగర్ ఆరో లైన్‌లో, టీచర్స్ కాలనీ, బంజారా కాలనీ, లడకబజార్, ఆజాద్ రోడ్డుతో పాటు అనేక చోట్ల రంగు రంగుల విద్యుత్ దీపాలతో పందిళ్లు వేసి ఎనిమిది రోజుల పాటు సాగిన బతుకమ్మల ఆటపాటలు, కోలాటాల సందడి నేటితో ముగిసింది.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

తల్లాడ: మండలం అంబేద్కర్‌నగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మలను వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పాటలు, నృత్యాలతో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

భక్తరామదాసు సేవాసంస్థ ఆధ్వర్యంలో...

ముదిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వల్లభిలో భక్తరామదాసు సేవాసంస్థ ఆధ్వర్యంలో రామాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మలు పేర్చి చుట్టూ తిరుగుతూ ఆటలాడారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కల్లూరు: కల్లూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఉద్యోగులంతా కలిసి దసరా ఉత్సవాల్లో భాగంగా ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపులతో సాగనంపారు. ప్రధాన వైద్యాధికారి రమేష్ తమవంతుగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు రమాదేవి, రజనీ, జానకీ, రాధిక, మానస తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



వెంగళరావునగర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సరస్వతీ దేవి ఆశీస్సులతో చిన్నారులు అందరూ చదువుల్లో రాణించాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం శ్రీ గాయత్రీ, శ్రీ లలితా సహిత శ్రీ జ్ఞాన సరస్వతీ దేవీ ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి సామూహిక అక్షరాభ్యాసాలు, శ్రీ సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ మందిరం, వెంగళరావు నగర్‌లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి ఆలయం, జేవీఆర్ ఓసీలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

కుటుంబసభ్యులు, మహిళలతో కలిసి బతుకమ్మలాడిన వైరా ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన సతీమణి లలిత, కుటుంబ సభ్యులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో ఆడిపాడారు. బతుకమ్మలాడే మహిళలను ఆయన ఉత్సాహపరిచారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సతీమణి ఇందుమతి సహా స్థానిక మునిసిపాలిటీ మెప్మా మహిళలు, పలు గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు ఈ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మలకు వాడే తంగేడు పువ్వు తెలంగాణ అధికార పుష్పంగా ఉందని ఆ పుష్పంతో కలిపి బతుకమ్మలాడటం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ల గంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, నాయకులు ధార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, రాంపూడి రోశయ్య, యడ్లపల్లి వనజ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: తల్లాడ మండలంలోని కొత్తమిట్టపల్లిలో సోమవారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మలను కొలుస్తూ ఆటపాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు జక్కంపూడి కిషోర్, గణేషుల రవి, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సర్పంచ్ పదవి దక్కించుకోనున్న రుద్రజారాణి



రుద్రజారాణి

పెనుబల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏజన్సీ ప్రాంతంలో స్థానిక సంస్థల్లో సర్పం చ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లలో ఎస్టీలకే కేటాయిస్తున్న నేపథ్యంలో ఆ పంచాయతీలో ఒకే ఇల్లు ఉండటంతో గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన కాకా రుద్రజారాణి గౌరారం (ఉప్పలచలక) సర్పంచ్ పదవి దక్కనుంది. పెనుబల్లి మండలంలోని ఏజన్సీ ప్రాంతం లో ఉన్న ఉప్పలచలక గ్రామపంచాయతీ సర్పంచ్, సగం వార్డులు ఎస్టీలకు కేటాయించారు. ఆ గ్రామ పంచాయతీలో కేవలం ఒకే ఒక్క ఎస్టీ కుటుంబం నివాసముంటుంది. అందులోనూ ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. దీంతో ఆ గ్రామంలో పోటీకి ఒక్కరికే అర్హత ఉంది. గత ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితులుండటంతో కాకా రుద్రజారాణి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రస్తుత రిజర్వేషన్ల నేపథ్యంలో సర్పంచ్ పదవిని ఎస్టీ జనరల్‌కు, ఉన్న 8వార్డుల్లో 4వార్డులు ఎస్టీలకు కేటాయించారు. దీంతో ఆ గ్రామంలో పోటీకి అర్హత ఉన్న ఒకే ఒక్క యువతి రుద్రజారాణికి సర్పంచ్ పదవి వరిం చనుంది. గతంలో కూడా ఈ పంచాయతీ సర్పంచ్ పదవి మహిళకు కేటాయించగా రుద్రజారాణి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైంది. గత పాలకవర్గంలో నాలుగు వార్డు సభ్యుల పదవులు ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొని ఉంది. రిజర్వేషన్ల నేపథ్యంలో రుద్రజారాణికి మరోసారి సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా దక్కనుంది.

అంతరించిపోతున్న పగటివేషగాళ్ల కళలు



దేవతామూర్తుల వేషధారణలో..

కారేపల్లి సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పూర్వం గ్రామాల్లో అనేక మంది కళాకారులు వివిధ రకాల వేషధారణలో వీధినాటికలు, అనేక కళలు ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందుతూ వారిచ్చే ధాన్యం, నగదుతో జీవనం గడిపేవారు. రానురాను పగటి వేషధారుల కళలు, ప్రదర్శించే కళాకారులు అంతరించిపోతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో వివిధ కళలును ప్రదర్శిస్తు జీవనం గడుపుతున్నారు. ఇదే పద్ధతిలో మండల పరిధిలోని విశ్వనాథపల్లి పంచాయతీలో ఇద్దరు కళాకారులు ఐదు రోజులుగా రోజుకోవేషం వేస్తూ గ్రామస్థులను విశేషంగా ఆకరిస్తున్నారు. ఇలా ఐదు రోజులు పూర్తి అయిన తరువాత గ్రామంలో ఇంటింటికి తిరిగివారు ఇచ్చిన డబ్బులు తీసుకుని మరోఊరుకి వెళుతూ జీవనం గడుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు ప్రదర్శించిన కళలను ప్రదర్శిస్తూ కుటుంబాలను పోషంచుకుంటున్నట్లుగా తెలిపారు. తమలాంటి పేదవారిని ప్రజలు వారికి తోసిన సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.